
జాబిల్లిపై జయహో భారత్

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

చంద్రయాన్ -3 విజయవంతం కావడంతో దేశవ్యాప్తంగా సంబరాలు జరుపుకుంటున్నారు.ఈ నేపథ్యంలో నేను సైతం అంటూ శుక్రవారం అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి జెడ్‌పి ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ ల్యాండర్ విక్రమ్ నుండి వేరుపడి చంద్రుని దక్షిణ ధృవంపై అడుగుపెట్టిన రోవర్ ప్రజ్ఞాన్ చిత్రాన్ని కలర్ పెన్సిల్స్ ఉపయోగించి వేశారు. ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది.



ఆకట్టుకుంటున్న చంద్రయాన్-3 చిత్రం

సాగు,తాగు నీరు కలుషితం

- డ్రైనేజీలను తలపిస్తున్న పంట కాలువలు
- లక్షలాది మందికి తాగునీటి సరఫరాకు ఇవే ప్రధాన ఆధారం
- చోద్యం చూస్తున్న అధికారులు

అపరభగీరథుడు ఆర్ధర్ కాటన్ మహాశయుని అవిరళ కృషి ఫలితంగా గోదావరి జిల్లాలకు కాలువల ద్వారా సాగునీరు -తాగునీరు పుష్కలంగా లభిసోంది. గోదావరి జలాలు ఈ కాలువల ద్వారా ప్రవహిస్తూ కలుషితం అవుతున్నాయి. ఒకనాడు ఈ కాలువల నీరు స్వచ్ఛంగాను, పరిశుభ్రంగాను ఉండేవి. జిల్లాలో ప్రజలు తియ్యటి నీరు తాగేవారు. నేడు గోదావరి కాలువలు అన్నీ చెత్తా చెదారాలకు నిలయాలయ్యాయి. ఈ కలుషిత నీరు తాగిన ప్రజలు భయంకరమైన వ్యాధులకు గురవుతున్నారు. ఈ విషపూరితమైన నీరు ప్రజల ఆరోగ్యాన్ని హరించడమేకాక పొలాలలో పంటలు కూడా 'చీడ-పీడలకు' గురి అవుతూ పంటలో నష్టాన్ని చవిచూస్తున్నారు.

ప్రజాశక్తి-రాజోలు

జిల్లాలోని 75శాతం ప్రజల దహార్తిని తీర్చాలన్న, పంటలు పండాలన్న ఈ కాలువలే ఆధారం...ఆలాంటి ఈ పంట కాలువలద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 35 లక్షల మంది దాహార్తిని తీరుస్తున్నాయి. 4.50 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తున్నాయి.ఇంతటి ప్రాధాన్యమున్న కాలువల అభివద్ధిని యంత్రాంగం విస్మరిస్తోంది. దీనికితోడు కొందరి నిర్వాకం వల్ల కాలువల్లో నీరు కలుషితమవుతోంది. జిల్లాలో మధ్య, తూర్పు డెల్టాల్లో 431 కిలోమీటర్ల పొడవున 10 ప్రధాన పంట కాలువలు, వాటికి అనుసంధానంగా 2,024 కిలోమీటర్ల మేర 1500 పిల్ల కాలువలు ఉన్నాయి. ప్రధాన పంట కాలువలపై ఆధారపడి జిల్లాలో 46 సమగ్ర రక్షిత నీటి పథకాలను నిర్వహిస్తున్నారు.ఇవి రోజూ సుమారు 23 లక్షల మందికి తాగునీటి అవసరాలు తీరుస్తున్నాయి. వీటితో పాటు రాజమహేంద్రవరం, కాకినాడ నగరాలు, కొన్ని పురపాలక సంఘాల పరిధిలో సుమారు 12 లక్షల మందికి తాగునీటి సరఫరాలో కూడా ఈ కాలువలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. నీటి పథకాలకు ముడి నీటిని సరఫరా చేస్తున్న కాలువలు స్వార్ధపరుల చేష్టలతో మురుగుమయంగా మారుతున్నాయి. జిల్లాలో పలు చోట్ల ఇళ్ల నుంచి మురుగునీటి పైపులు, మరుగుదొడ్ల గొట్టాలను కాలువల్లోకి అనుసంధానించడంతో కాలువల్లో నీరు కలుషితమవుతోంది.ఇక గ్రామాల్లో సేకరించిన చెత్త, పశువుల మత కళేబరాలను సైతం కాలువల్లో పడేస్తున్నారు.జిల్లాలో సామర్లకోట, కాకినాడ, మండపేట, కోరింగ, ఇంజరం, కాకినాడ-మంజూరు జంక్షన్ కెనాల్ (కెఎంజె), పి.గన్నవరం, అమలాపురం, ముక్తేశ్వరం కేంద్రాలుగా 10 ప్రధాన పంట కాలువలున్నాయి. వీటిలో ప్రవహిస్తున్న జలాలు తాగునీటి ప్రాజెక్టులకు పైపులైన్ల ద్వారా వెళ్తుంది. అక్కడ ఆ నీటిని శుద్ధిచేసి ప్రజలకు తాగునీరుగా సరఫరా చేస్తున్నారు.



చెత్త తో నిండిన పి.గన్నవరం ప్రధాన పంట కాలువ



డ్రైనేజీ ని తలపిస్తున్న రాజోలు పంట కాలువ

నీరు కలుషితం కాకుండా..

రెండున్నర దశాబ్దాల కిందటి వరకు ఈ కాలువలను ఎంతో పవిత్రంగా చూసేవారు. అప్పట్లో కాలువల్లో ప్రవహించే నీటిని దోసిళ్లతో పట్టుకుని నేరుగా తాగేవారు. కాలక్రమంలో కాలువల్లో నీరు కలుషితమవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ప్రధాన పంట కాలువలు మొదలుకుని పిల్ల కాలువలు సైతం మురుగుమయంగా మారుతున్నాయి.కాలువల్లో నీరు ప్రవహిస్తున్న సమయంలో మురుగునీటి తూరలు బయటకు కనిపించవు.ప్రస్తుతం కాలువలు కట్టేయడంతో అవి స్పష్టంగా కనిస్తున్నాయి. జిల్లాలో లక్షలాది మంది ప్రజల దాహార్తిని తీరుస్తున్న ఈ పంట కాలువలను ప్రక్షాళించేందుకు ప్రస్తుతం అనువుగా ఉంటుంది. ప్రధానంగా పంట కాలువలకు అనుసంధానించి ఉన్న మురుగునీటి గొట్టాలను మూసివేయించాల్సి ఉంది. ఈ దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపడితే కాలువల్లో నీరు కలుషితం కాకుండా చూడొచ్చు. దీనిపై కార్యాచరణకు జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆయా కమిటీల్లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను సభ్యులుగా నియమిస్తే ఈ కార్యక్రమం విజయవంతంగా జరుగుతుంది.

చర్యలు చేపట్టని ప్రభుత్వం

వంద సంవత్సరాలకు పూర్వం నిర్మించిన ఆనకట్టలు, బ్యారేజీలు, లాకులు, షట్టర్లు, టన్నేళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలువలు కూడా చాలాచోట్ల మేటలు వేశాయి. నాచు, తూటి, గుర్రపు డెక్క, రెల్లుగడ్డి పెరిగాయి. కాలువగట్లు బలహీనంగా ఉన్నాయి. చాలాచోట్ల గండ్లు పడుతున్నాయి. మరికొన్నిచోట్ల కాలువగట్లపై మట్టిత్రవ్వుకుపోవడం జరుగుతున్నది. అప్పుడప్పుడు అరకొరగా మరమ్మతులు చేస్తున్నప్పటికీ కట్టుదిట్టమైన రక్షణచర్యల్ని ప్రభుత్వం చేపట్టడం లేదు. చాలాచోట్ల ఈ కాలువగట్లుపైన ఆలయాలు, మండపాలు నిర్మించబడుతు న్నాయి. మరికొన్ని చోట్ల శాశ్వత ప్రాతిపదికన పక్కాభవన నిర్మాణాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఇరిగేషన్ పి.డబ్ల్యు.డి వారుగాని, ప్రభుత్వ అధికారులుగాని వీటిపై ఏ విధమైన చర్యలు చేపట్టడం లేదు. ఇదివరలో ఈ కాలువలపైన అజమాయిషీ చేసే డెల్టా కలాసులు, మైలు కూలీలు ఉండేవారు. ఆ సిబ్బంది ఇప్పుడు ఎక్కడా లేదు. పవిత్రమైన, ప్రాణాధారమైన కాలువల నీరు ఇన్ని రకాలుగా కాలుష్యం అవుతున్నందున ప్రభుత్వ యంత్రాంగం ఇంతవరకు ప్రదర్శిస్తున్న నిర్లిప్తతను ఇకనైనా విడనాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇలా చేస్తే పూర్వవైభవమే

-కాలువల పూడిక, తూడు మొదలైనవి ఎప్పటికప్పుడు తీసివేయాలి.

- కాలువగట్లను కట్టుదిట్టం చేయాలి. గుడులు, మందిరాలు కట్టకుండా నిరోధించాలి.

-ఇళ్లల్లోని మలమూత్ర గొట్టాలు కాలువల్లోకి పెట్టినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

-డ్రైనేజీలు ఈ కాలువ లోకి రాకుండా అరికట్టాలి.

-గ్రామపంచాయతీలకు, మున్సిపాలిటీలకు, మున్సి పల్ కార్పొరేషన్‌లకు, గహస్తులకు ప్రభుత్వం నోటీసుల ద్వారాను, టాంటాం ద్వారాను ఆదేశాలు జారీ చేసి కాలువలు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలి.

-గ్రామ పెద్దలు, ప్రజలు,ప్రజా ప్రతినిధులు కాలువలు కాలుష్యం కాకుండా ప్రచార ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలి.లేకపోతే కాలువలకు మనుగడ అసాధ్యం.

ఇంటింటికీ ఓటు సర్వేపై సమావేశం



పాల్గొన్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం నియోజకవర్గానికి సంబంధించి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎన్.ఎస్.వి.బి.వసంత రాయుడు అధ్యక్షతన రెవెన్యూ డివిజనల్ కార్యాలయం నందు ఎఇఆర్‌ఒ, సూపరవైజర్లు, బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గత నెల 21 నుంచి ఈనెల 21వ తేదీ స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 కు సంబంధించి వివిధ అంశాలపై హౌస్ టు హౌస్ సర్వే లో నమోదు చేసిన చేర్పులు, మార్పులు, తొలగింపులలో నమోదులు సక్రమంగా చేయాలని ఆర్‌డి అన్నారు. ఓటు తొలగింపు నకు సంబంధించి ఓటరు చనిపోయినట్లు అయితే చనిపోయిన వ్యక్తి ఓటు తొలగించాలంటే ఫామ్ 7 దరఖాస్తు ఉండాలని,. మరణ ధవపత్రం తీసుకోవాలని, అదే విదంగా శాశ్వతంగా బదిలీ కాబడిన ఓటరు తొలగింపు విషయం లో తప్పనిసరిగా నోటీసు ఇచ్చి, ఒకవేళ ఓటరు అందుబాటులో లేకపోతే సమాచారం తెలిసి ఉన్నట్లు అయితే తప్పనిసరిగా రిజిస్టర్ పోస్టు ద్వారా సమాధానమునకు 15 రోజుల గడువుతో పంపవలెనని తెలియజేశారు.. ఈ ఆర్వో నెట్ 2.0 ప్రకారం ఓటుఏ నియోజకవర్గం లో ఉన్నా సరే ఇపిఐసి నెంబర్ ద్వారా ఫామ్ -8 ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లు అయితే ప్రస్తుతం ఉన్న నియోజకవర్గానికి మార్చుకోవచ్చునన్నారు. 20 సంవత్సరాలు పైబడిన వారు ఓటు నమోదుకు దరఖాస్తు చేసినట్లు అయితే వారికి పూర్వం ఉన్న ఓటరు ఇ పిఐసి నెంబర్ తో పాటు ఫామ్ -8 నందు దరఖాస్తులు స్వీకరించవలెనని, ఒక వ్యక్తి నుండి ఎక్కువ ధరఖాస్తులు స్వీకరించవద్దన్నారు. ఓటర్ల దరఖాస్తుల పరిశీలనలో బిఎల్‌ఎలతో పాటు పరిశీలించాలన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకుకే వాలంటీర్ల వ్యవస్థ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని నాగుల చెరువు గ్రామంలో శుక్రవారం గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, పార్టీ నాయకులతో ఇంటింటకీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్‌సి తోట మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో పేద,.మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. పేదల సమస్యలను తెలుసుకునేందుకు వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థను, ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, జెడ్‌పిటిసి సభ్యుడు పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ మూర్తి, ఎఎంసి ఛైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, పిఎసిఎస్ ఛైర్మన్ మేడిశెట్టి గోవిందు, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, ఎంపిడిఒ ఎం.రామ కృష్ణారెడ్డి, తహశీల్దార్ కె.సూర్యారావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు



గడప..గడపకూ కార్యక్రమంలో ఎంఎల్‌సి తోట

నేటి నుంచి వెంకన్న వార్షిక పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

కోనసీమ తిరుమల గా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక పవిత్రోత్సవాలు శనివారం నుండి మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేశ్ రాజు, ఇఒ ఎం. సత్యనారాయణ రాజు తెలిపారు ఇందులో భాగంగా దేవాలయం అంతా వివిధ ప్రాంతాల నుండి తీసుకొచ్చిన పువ్వులతో ఆలయ ప్రాంగణం అంతా అలంకరించారు ఈ కార్యక్రమాలను ఆలయానికి వచ్చే యాత్రికులు తిలకించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు

విద్యుత్ బిల్లులను ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాలి

ప్రజాశక్తి-అయినవిల్లి

విద్యుత్ బిల్లులను వినియోగదారులు ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాలి అనిఅమలాపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవి కుమార్ శుక్రవారం తెలిపారు. 26, 27 తేదీల్లో అయినవిల్లి మండలంలో అన్ని గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పంచాయతీ కార్యాలయాల్లో విద్యుత్ సిబ్బంది కరెంట్ బిల్లుకు ఆధార్ కార్డులను అను సంధానం చేస్తారన్నారు. వినియోగ దారులు ఈ రెండు రోజుల్లో తమ విద్యుత్ బిల్లు అదే పేరున ఉన్న ఆధార్ కార్డులు తీసుకు రావాలని వినియోగదారులు తప్పకుండా అనుసంధానం చేసుకొవాలన్నారు.

కార్టూ'నిజం'



ఈ మధ్యన అసలు వర్షాలకంటే... ఈ వర్షాలు ఎక్కువైపోయాయిరా!

వాలంటీర్లకు నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

సమనస గ్రామ సచివాలయం పరిధిలో ఎంపిక చేయబడిన ముగ్గురు వాలంటీర్లకు శుక్రవారం ఎంపిడిఓ జె.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. సచివాలయం పరిధిలో ఖాళీగా ఉన్న మూడు వాలంటీర్ పోస్టులకు ఇటీవల ఇంటర్వ్యూలు నిర్వహించగా జనుపల్లి సురేష్, కందేరి నాగ దుర్గ, జనుపల్లి శతిలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుర్ని కరికాల భక్త కార్పొరేషన్ డైరెక్టర్ కరెళ్ళ రమేష్ బాబు, అమలాపురం మండల కో ఆప్షన్ సభ్యుడు మొసలి స్పర్జన్ రాజు, సమనస గ్రామ సచివాలయం కన్వీనర్ మామిళ్ళపల్లి ఫణి కుమార్, గ్రామ కార్యదర్శి పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేసిన ఎంపిడిఒ తదితరులు

సాగు విధానాలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-అయినవిల్లి

మండలంలోని సిరిపల్లి వ్యవసాయ క్షేత్రంలో వైయస్సార్ పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి వై శోభ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు దీనిలో భాగంగా రైతులకు పొలంబడిలో గ్రూప్ సభ్యులు తో రైతులకు మిత్రపురుగులు, శత్రు పురుగులను గమనించి అవగాహన కల్పించారు. వసాయ భాగస్వామ్య కార్యాచరణ పరిశోధన రైతులతో చేయంచారు. గ్రూప్ డైనమిక్స్ లో భాగంగా జంతువులు లాగా అరవడం మరియు వాటర్ బాటిల్ లో పెన్ పెట్టడం మరియు వేప గింజల కషాయం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు టి.సురేష్ రైతులు పాల్గొన్నారు.



వరిచేలో రైతులతో పరిశోధన చేయిస్తున్న వ్యవసాయ అధికారి వై.శోభ



ఇప్పనపాడు వద్ద జరుగుతున్న రోడ్డు పనులు

రోడ్డు పనులు పున:ప్రారంభం

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని తాపేశ్వరం - ద్వారపూడి రోడ్డు పనులు శుక్రవారం పున ప్రారంభమయ్యాయి. ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు గురువారం రోడ్డు భవనాల శాఖ అధికారులు, కాంట్రాక్టర్ తో కలిసి రోడ్డు పరిస్థితిని పరిశీలించారు. అనంతరం సోమవారం నుంచి వేగవంతంగా రోడ్డు పనులు పూర్తి చేసి వినియోగం తీసుకొస్తామని చెప్పిన నేపథ్యంలో ఈ రోడ్డు లో జరుగుతున్న పనులను ఎఇ సూర్య నారాయణ సమక్షంలో పనులను పర్యవేక్షించారు.

ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలో గల ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను యువ నాయకుడు, ఎంపీ బోస్ తనయుడు పిల్లి సూర్య ప్రకాష్ పంపిణీ చేశారు. శుక్రవారం ఆయన పుట్టినరోజును పట్టణంలోని బోస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అభిమానులు, యువకులు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాసుపత్రిని సందర్శించి రోగులకు అవసరమైన పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. అన్ని గ్రామాల నుంచి వచ్చిన అభిమానులకు ఆయన కతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బోస్ అభిమానులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న పిల్లి సూర్యప్రకాష్

భీమేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. ఇక్కడ గల మాణిక్యమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, లలిత సహస్రనామ పారాయణలు నిర్వహించారు. ఏర్పాట్లను ఇఒ పి. తారకేశ్వర రావు పర్యవేక్షించారు



ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

ఇసుకపూడిలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి-అంబాజీపేట

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా పేదల ముంగిట వైద్యాధికారులు వైద్య సేవలు అందించడం పట్ల ప్రజల హర్షం చేస్తున్నారు. శుక్రవారం ఇసుకపూడిలో తురకలదొడ్డి నందు డాక్టర్ కెఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్ చల్లించారు. దోమలు రకాలు, వాటి వల్ల వ్యాపించి జ్వరాలు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ బి.అప్పారావు, ఎంఎల్‌హెచ్ పి.సుమంత్, ఎంపిహెచ్ ఎ.మురళి, ఎఎన్ఎం మణికంఠ, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది, డిఇఒ కుమారి, పైలెట్ త్రిమూర్తులు, పాల్గొన్నారు.



వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం



లూటుకుర్రులో ఆర్ బికె కేంద్రాన్ని ప్రారంభించిన ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు

సాగుపై అవగాహనకు ఆర్‌బికెలు దోహదం

ప్రజాశక్తి - మామిడికుదురు

రైతులకు చేరువలో వ్యవసాయ సాగు పద్ధతులు అవగాహన కల్పించేందుకు ఆర్‌బికె కేంద్రాలు ఎంతో దోహదపడతాయని ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. లూటుకుర్రులో రూ.23.94 లక్షలతో నిర్మించిన ఆర్‌బికెను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం పాశర్ల పూడిలంక నుంచి వయా లూటుకుర్రు మీదుగా ఆదుర్రు వరకూ రూ.2.40 కోట్ల వ్యయంతో నిర్మించే రోడ్డు పనులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ అడబాల తాతకాపు, జెడ్‌పిటిసి సభ్యుడు కె.అంజి బాబు, ఎంపిటిసి సభ్యుడు నామనవెంకటేశ్వరరావు, తదితరులు, పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-మండపేట

మండపేట ప్రభుత్వ కాలేజీలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకొనవచ్చునని ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి.శ్రీనివాసరావు తెలిపారు. కామర్స్ లో మూడు, తెలుగులో ఒకటి, ఫిజికల్ డైరెక్టర్ ఒకటి, పొలిటికల్ సైన్స్ ఒకటి, హిస్టరీ ఒకటి, బోటనీ ఒకటి, సబ్జెక్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. పోస్టులకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో 55శాతం, నెట్ సెట్, పిహెచ్.డి ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తార న్నారు. దరఖా స్తులను ఆగస్టు 30 లోపు అందజే యాలన్నారు. వివరాలకు 95053,18704 నెంబర్ లో సంప్రదించాలన్నారు.

28న మండపేటలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో మండపేట గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ఈ నెల 28న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు.ఈ సందర్భముగా జిల్లా నైపుణ్యభివద్ధి అధికారి పి. లోకమాన్ మాట్లాడుతూ మెగా జాబ్ మేళా లోదాదాపు 14 కంపెనీలలో సుమారు 930 పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. నిరుద్యోగ యువత జాబ్ మేళాలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూకి బయోడేటా, ఆధార్ ఐడి అండ్ అడ్రెస్ ప్రూఫ్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోగ్రాఫ్, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ, డిగ్రీ, పిజి, ఫార్మసి కోర్సులు చదినవారు అర్హులన్నారు. జీతం రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు ఇవ్వబడునని తెలిపారు.

ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన పాటి శివ

ప్రజాశక్తి-రాజోలు

తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను శుక్రవారం ఏపీ ప్రభుత్వ నెడ్ కాప్ డైరక్టర్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ పాటి శివకుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వైసిపి సోషల్ మీడియా చురుగ్గా పని చేస్తుందని సిఎం అభినందించారు. రానున్న రోజుల్లో మరింత చొరవతో సోషల్ మీడియా పనిచేయాలని సిఎం సూచించినట్లు శివ కుమార్ తెలిపారు. జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా తనపై మరింత బాధ్యత పెరిగిందని శివకుమార్ అన్నారు.



సిఎం జగన్‌తో పాటి శివకుమార్

వైసిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వైసిపిలో వివిధ పదవుల్లో నియమితులైన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అమలాపురం ఎంపీ చింతా అనురాధ సూచించారు. జిల్లా వైసిపి కార్యదర్శిగా నియామకం పొందిన పెదగాడవిల్లికి చెందిన నిమ్మకాయల హనుమంత శ్రీనివాసరావు శుక్రవారం ఎంపీ అనురాధను ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును ఎంపీ సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. వైసిపి నాయకుడు నల్లా శ్రీను తదితరులు ఉన్నారు.

వైసిపి జిల్లా కార్యవర్గానికి అభినందనలు

ఐ.పోలవరం : వైసిపి జిల్లా కమిటీలో కొత్త కార్యవర్గంలో ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ మరోసారి అధ్యక్షునిగా కొనసాగుతున్న వర్గంలో ఐ.పోలవరం మండలానికి చెందిన విత్తనాల శ్రీనివాసరావు వై సి పి జిల్లా సెక్రటరీ నియమితులయ్యారు. జనరల్ సెక్రటరీలుగా జి.మూలపొలం,కేశనకుర్రు గ్రామ పంచాయతీ కి చెందిన రేవు అప్పారావు, మోకా రవి కుమార్ ఎంపికయ్యారు. శుక్రవారం వీరిని ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్‌పిటిసి సభ్యులు ముదునూరి సతీష్‌రాజు, వైసిపి మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకట పతిరాజు, కాటం సత్తిరాజు అభినందనలు తెలియజేసినారు.

వైసిపి జిల్లా కార్యదర్శిగా రాంబాబు

అయినవిల్లి : వైసిపి జిల్లా కార్యదర్శిగా అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన మిండగుదిటి శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు)ను రాష్ట్ర పార్టీ నియమించింది. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు గురువారం నియామక ప్రకటన జారీ చేశారు. తనను జిల్లా కార్యదర్శిగా నియమించిన సిఎం జగన్‌కు, దీనికి సహకరించిన ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబుకు, అధ్యక్షులు పొన్నాడ సతీష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



మంగళసూత్రాలు బహూకరిస్తున్న దృశ్యం

'అప్పనపల్లి'లో అమ్మవార్లకు మంగళసూత్రాల సమర్పణ

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి దేవస్థానంలో పద్మావతి, అండాళ తయారు అమ్మవార్లకు శుక్రవారం తామరాడకు చెందిన కానూరి బాలాజీ శ్రీనివాస్ కనకదుర్గ వెంకటలక్ష్మీ , సురేష్ కోమలి దంపతులు 8 గ్రాములు బంగారంతో కూడిన రెండు జతల మంగళ సూత్రాలు శుక్రవారం బహూకరించినట్లు ఆలయ సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. ఆలయ అర్చకులు సంప్రోక్షణ చేసి అమ్మవార్లకు అలంకరించారు. దాతలకు ఛైర్మన్ చిట్టూరి రామకష్ణ, మరియు ధర్మకర్తల మండలి సభ్యులు, స్వామివారి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

తల నీలాల మొక్కులు వాయిదా వేసుకోవాలి

బాల బాలాజీ స్వామికి తలనీలాలు సమర్పించే భక్తులు ఈ నెల 26 శనివారం నుంచి తమ మొక్కుబడులు వాయిదా వేసుకోవవలసినదిగా ఆలయ ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ మరియు సహాయ కమిసనర్ జి.మాధవి శుక్రవారం తెలిపారు. స్వామి దర్శనం, పూజా కార్యక్రమాలు మరియు అన్నదానం యథావిధిగా జరుగుతాయన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామ శివారులో శుక్రవారం పేకాట శిబిరంపై ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ దాడి చేశారు. పేకాడుతున్న ముగ్గురిని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

బైండోవర్ ఉల్లంఘించడంతో రూ.80 వేల జరిమానా

ప్రజాశక్తి గోపాలపురం

నాటు సారా తయారుచేసిన విక్రయించిన చట్టపరమైన చర్యలు తప్పవని దేవరపల్లి ఎస్ఇబి సిఐ డి.సుధ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని రేగులగుంట గ్రామానికి చెందిన ఇళ్ల నాగ వెంకట సతీష్‌ను గతంలో నాటు సారా కేసులో గోపాలపురం తహశీల్దారు వద్ద 110 సిఆర్‌పిసి ప్రకారం బైండోవర్ చేశారు. బైండోవర్ ఉల్లంఘించి తరువాత కూడా నేరం చేయగా అతడిని తహశీల్దారు వద్ద ప్రవేశపెట్టగా రూ.80 వేల జరిమానా విధించినట్లు ఆమె తెలిపారు. జరిమానా సొత్తును గవర్నమెంట్ వారికి చలానా రూపంలో జమ చేసినట్లు చెప్పారు.


అరటి తోటను పరిశీలిస్తున్న సర్పంచ్, సొసైటీ అధ్యక్షుడు

కుటుంబ కలహాలతో అరటి తోట నరికివేత

ప్రజాశక్తి-పెరవలి

మండలం ఖండవల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న లంకమాలపల్లి గోదావరి లంకలో గురువారం మధ్యాహ్నం అరటి గెలలు వేసి ఒక నెలలో కోతకు సిద్ధంగా ఉన్న అరటి తోట కుటుంబ కలహాలు కారణంగా నరికి వేశారు. అరటి తోటను శుక్రవారం సర్పంచ్ పులిదిండి నాగరాజు సొసైటీ అధ్యక్షులు కుసుమే సూరిబాబు సందర్శించారు. ఈ పంట భూమి చిన్నం సుబ్బలక్ష్మికి చెందినది. వీరి కుటుంబ తగాదాల కారణంగా పంట చేతికొచ్చిన అరటి తోట నరికి వేయడంతో ప్రస్తుతం కౌలు చేస్తున్న రైతులు పాలపర్తి సూరయ్య పాలపర్తి శ్రీను రోడ్డున పడ్డారు. సంవత్సర కాలంగా భారీగా రూ.6 లక్షల మేర పెట్టుబడి పెట్టామని వారు వాపోయారు. నాలుగు సంవత్సరాలుగా కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నామన్నారు.జ ప్రస్తుతం శ్రావణమాసం మార్కెట్లో అరటిగెల ధర ఒక గెల రూ.300 నుంచి రూ.500 ధర పలుకుతుందన్నారు. ఒక నెలలో పంట చేతికి వచ్చే సమయానికి కుటుంబ తగాదాల కారణంగా తోటను నరికి వేసారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కుటుంబ సభ్యులతో కష్టపడి సంవత్సరం పొడవునా పెట్టుబడి పెట్టి పంట కోతకు వచ్చే సమయానికి దౌర్జన్యంగా మధ్యాహ్నం సమయంలో వచ్చి తోట నరికి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తగు న్యాయం జరిపించాలని అధికారులు, నాయకులను వారు కోరారు.


సన్మానిస్తున్న సతీష్ రెడ్డి తదితరులు

ఆదిత్యకు నాక్ ఎ ప్లస్‌ప్లస్ గుర్తింపు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు ఇటీవల వచ్చిన నాక్ ఎ ప్లస్ ప్లస్ గుర్తింపుతో మరింత బాధ్యత పెరిగిందని విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి అన్నారు. కాకినాడ జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం 15వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విసి జివిఆర్.ప్రసాదరాజు, ఎపి సాంకేతిక ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డిని దుశ్శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలు అధిపతులు అధ్యాపకులు వైస్ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాసరెడ్డికి అభినందనలు తెలిపారు.

ఉత్తమ సేవలపై డాక్టర్ శిరీషకు సత్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు సిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శిరీష ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికైన సందర్భంగా విశ్వజన కళామండలి, దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్, కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆమెను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు మాట్లాడుతూ అంబేద్కర్ అన్న విధంగా చదువు వల్లే ప్రతి మనిషికీ ఈ దేశంలో గుర్తింపు వస్తుందని, ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ శిరీషకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు వాకపల్లి చిరంజీవి, పెయ్యల రమేష్, మాల మహానాడు అధ్యక్షులు రేవు శ్రీను, దాడి షణ్ముఖ రాజు, చెల్లి ఏసుదాసు, సుందరపల్లి సత్యనారాయణ, జక్కల చిన్నారి, రోళ్ల వెంకయ్యానాయుడు పాల్గొన్నారు.

మందుబాబుల ఆగడాలు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక కలువపువ్వు సెంటర్లోని వేగుళ్ళ వీర్రాజు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మందుబాబుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. రాత్రీ పగలు తేడా లేకుండా మెట్లమీద కూర్చుని వీరంగం వేస్తున్నారు. దీంతో వ్యాపారస్తులు, ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారాలు అంతంతమాత్రంగా ఉన్న నేపథ్యంలో వీరి ఆగడాలతో ఖాతాదారులు దుకాణాలకు రాకపోవడంతో వ్యాపారాలు సాగక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. అనేకమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పలువురు వపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పోలీసులు స్పందించి వారికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

అక్రమాలకు, మాదక ద్రవ్యాలకు అడ్డాగా మార్చారు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కాకినాడ నగరం ఎంతో ప్రశాంతతకు మారుపేరుగా ఉండేదని దాన్ని ఇప్పుడు వైసిపి ప్రభుత్వ హయాంలో అక్రమాలకు, మాదకద్రవ్యాలకు అడ్డాగా మార్చారని టిడిపి నగర నాయకులు ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో టిడిపి కాకినాడ నగర టిడిపి అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, బంగారు సత్యనారాయణ శుక్రవారం విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. టిడిపి ప్రభుత్వంలో కాకినాడను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశామని, ప్రస్తుతం నగరంలో అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. నాలుగేళ్ల క్రితం అధికారంలకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అవగాహన లేమివల్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోగా అక్రమాలు, అరాచకాలు, అన్యాయాలు వంటి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎంఎల్ఎ ద్వారంపూడిని నగర ప్రజలు ఓడించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని చెప్పారు. కాకినాడ నగరంలో అవినీతి పెచ్చు మీరిందని, వైసిపి నాయకుడు సుంకర విద్యాసాగర్ టౌన్ ప్లానింగ్ విభాగాన్ని తన కంట్రోల్లో పెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్నాడన్నారు. జగన్నాథపురం బ్రిడ్జి, కొండయ్యపాలెం వంతెనలను టిడిపి హయాంలో చాలా వరకు పూర్తి చేశామని, ఈ నాలుగేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం ఏమాత్రం పూర్తి చేయలేదన్నారు. నగరంలో వైసిపికి చెందిన రౌడీలు టిడిపి కార్యకర్తలపై దాడులు చేస్తూ వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ప్రస్తుతం కాకినాడలో అవినీతి, అరాచకం, మాదకద్రవ్యాలు రాజ్యం ఏలుతోందన్నారు.

చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు


ప్రజాశక్తి - పెద్దాపురం

మాతృభాషా దినోత్సవం సందర్భంగా పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ అన్నారు. చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్షులు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన శుక్రవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాతృభాష ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన పెంచేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు సబ్ జూనియర్స్ (4వ తరగతి వరకు), జూనియర్స్ (5, 6, 7 తరగతులు), సీనియర్(8, 9, 10 తరగతులు) విభాగాలుగా నిర్వహిస్తారన్నారు. ఈ పోటీల్లో ఆంగ్ల పదం లేకుండా తెలుగు భాష ఔన్నత్యంపై ఉపన్యాసం పోటీలు, పద్య పఠనం, తెలుగు కవులు, రచయితల వేషధారణ పోటీలు జరుగుతాయన్నారు. 27వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి యాసలపు సూర్యారావు భవనంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి రొంగల అరుణ్ కుమార్, కోశాధికారి కూనిరెడ్డి రవికుమార్, మంజుల, రవి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కార్యదర్శిగా ప్రభాకరరావు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వైసిపి జిల్లా కార్యదర్శిగా సర్పవరం గ్రామం ఉపసర్పంచ్, మాజీ ఎంపిటిసి సభ్యుడు పుల్ల ప్రభాకరావు నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆయన గ్రామంలో నలుగురు ఎంపిటిసి సభ్యులను ఏకగ్రీవం చేయడంలో, గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని, మచ్చలేని నాయకుడుగా మంచి గుర్తింపు ఉండటంతో అధిష్టానం గుర్తించి కార్యదర్శికి ఎంపిక చేసినట్లు సమాచారం. ఏ పార్టీలో ఉన్నా అంకితభావంతో పని చేయడంతో పాటు, ఆపార్టీకి న్యాయం చేయడమే నేడు జిల్లా కార్యదర్శిగా ఎంపికకు తార్కాణం. గ్రామస్థాయిలో మండలంలో తమకు ఉన్న పరిచయాలతో ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీ అభివృద్ధికి కృషి చేయడంపై జిల్లా కార్యదర్శిగా అర్హులని పలువురు నాయకులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. తనను పదవికి ఎంపిక చేసినందుకు పార్టీ అధినేత సిఎం జగన్మోహనరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు పుల్ల చందు, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, వార్డు సభ్యులు వానపల్లి వీరబాబు, గంటసాల సతీష్, రాయుడు విజయ్‌కుమార్, పుల్ల స్వాములు, పుల్ల చక్రధర్, జోకా సత్తిబాబు, వాసంశెట్టి గోవిందు, కాకి సురేష్, శ్రీ భవనారాయణ స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, పుల్ల శ్రీను, పుల్ల ధర్మరాజు, గంటసాల భద్రి తదితరులు ఆయనను అభినందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

మాజీ కేంద్ర మంత్రి పళ్లంరాజుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ సిడబ్ల్యూసీ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా నియమితులైన మాజీ కేంద్రమంత్రి ఎంఎం.పళ్లంరాజును కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సన్మానించాయి. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు దాట్ల వెంకట గాంధీ రాజు సారథ్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి, జనసేన, వైసిపిలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా ఎపిలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని తెలిపారు. పిసిసి సభ్యుడు ఆకుల వెంకటరమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

మున్సిపల్ వాటర్ వర్క్స్ దగ్గర పనిచేస్తున్న టెక్నికల్ నాన్ టెక్నికల్ కార్మికులకు ఈఎస్ఐపిఎఫ్ అమలు చేయాలని ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు పిలుపునిచ్చారు శుక్రవారం ఉదయం స్థానిక గోదావరి నల్ల ఛానల్ వద్ద గోదావరి టెక్నికల్ నాన్ టెక్నికల్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం కార్మిక నాయకులు వీ కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఎఐటియుసి జిల్లా కన్వీనర్ కె.రాంబాబు ప్రసంగించారు. యూనియన్ గౌరవ అధ్యక్షులుగా తాటిపాక మధు, అధ్యక్షులుగా వై.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కె. వెంకటేష్, జి.జగదీష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా బై.నాగబాబు, సహాయ కార్యదర్శిగా రోశయ్య, వి.రాహుల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎఐటియుసి నేత కొండ్రపు రాంబాబు, కోశాధికారిగా ఇ.చంద్రశేఖర్ మరో 9 మంది సభ్యులుగా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు

పూర్తి స్థాయిలో ధాన్యం కొనగోళ్లు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా ఖరీఫ్ సీజన్ లో పూర్తి స్థాయి కి ధాన్యం కొనుగోల లక్ష్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంనకు ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్ పర్సన్ బూరుగుపల్లి సుబ్బారావు, డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్ . తేజ్ భరత్ మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యం పూర్తి స్థాయి లో 4,55,846 మెట్రిక్ టన్నుల ధాన్యం పౌర సరఫరాల శాఖ ద్వారా కొనుగోలు కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కంటే తేజా, జి.జనార్ధన రావు, ఆదర్శ రైతులు ఎం.నరసింహారావు, డి. రామకృష్ణ, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పౌరసేవల సామర్థ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

రెవెన్యూ అనుబంధ ప్రభుత్వ కార్యక్రమాలు, పౌర సేవలు అందించే సామర్థ్యం మరింతగా పెంచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ డివిజన్, మండల స్థాయి అధికారులతో రెవెన్యూ, స్వమిత్వ, ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణ, సేవలు - మ్యుటేషన్, ధాన్యం సేకరణ పై డి ఆర్ వో తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

తొలగించిన ఓటర్ల జాబితా పరిశీలన

ప్రజాశక్తి-గోపాలపురం

ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నట్లు నియోజకవర్గం రిజిస్ట్రేషన్ అధికారి టిఇఎం.రాజు తెలిపారు.శుక్రవారం గోపాలపురంలో ఓట్ల జాబితాలో పేర్లు తొలగింపు సక్రమంగా ఉందో లేదో తెలుసుకునేందుకు నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. తొలగించిన ప్రతి ఓటు ను క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తామని ఓటు తొలగింపునకు ఉద్దేశపూర్వకంగా తప్పుడు అభ్యంతరం తెలియజేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్ కష్ణ, విఆర్ఒలు లక్ష్మి ,శ్రీను, మురళీకష్ణ ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

రూ.32 కోట్లతో పాఠశాలల్లో వసతుల కల్పన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రూ.32 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో పాఠశాలల్లో ఆధునిక వసతులు కల్పిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు చెప్పారు. శుక్రవారం ఆయన సాలిపేట, విముక్తి కాలనీ, శంతనపురి కాలనీ ప్రాంతాలలో స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న వివిధ పాఠశాలల అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాడు- నేడు పథకంతో పాటు స్మార్ట్ సిటీ నిధులను కూడా ఖర్చు చేసి ఆర్వో ప్లాంట్లు, ఫర్నిచర్ సహా సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. నిర్మాణంలో ఉన్న పాఠశాలల అభివద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చేపట్టిన పనులు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో జరిగేలా దృష్టి సారించాలన్నారు.

యానాం వార్తలు


సత్తిబాబును సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎపి కాంగ్రెస్ నేతలతో సత్తిబాబు భేటీ

ప్రజాశక్తి - యానాం

కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్రం మంత్రి మల్లిపూడి పల్లంరాజును కాకినాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యానాం కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లాడి సత్యనారాయణ (సత్తిబాబు) శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మల్లాడి సత్తిబాబుని పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్రమంత్రి పల్లం రాజు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో, పుదుచ్చేరిలో కాంగ్రెస్ పార్టీని అధికారంలో తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ఇటీవలే మల్లాడి సత్తిబాబు తన కేడర్‌తో కలిసి పుదుచ్చేరిలో పిసిసి అధ్యక్షుడు వైద్యలింగం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సిటీ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజ్, ఎపి మైనార్టీ సెల్ మహిళా అధ్యక్షురాలు పద్మజ, యానాం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్దాని దినేష్, సిహెచ్.మణికుమార్, తుళ్ళూరు రాజు, మల్లాడి వీరాస్వామి, దున్నా చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బ్రాంచ్ మేనేజర్ అశోక్ కుమార్

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి - యానాం

యానాంలోని ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ బ్యాంకు సభ్యులు (ఖాతాదారుల)కు మరింత మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ కె.వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బ్యాంకు ఆవరణలో ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే రెండవ అతిపెద్ద సొసైటీగా ఉందన్నారు. సుమారు రూ.530 కోట్లు లిక్విడ్ ఫండ్స్ ఉండగా, రూ.1900 కోట్లు డిపాజిట్లు ఉన్నట్టు తెలిపారు. తమ బ్యాంకులో ఫిక్సిడ్ డిపాజిట్స్‌పై 9.5 శాతం అత్యధిక వడ్డీ, సేవింగ్స్ ఖాతాల్లో రోజువారీ నిల్వలపై 6.50 శాతం వడ్డీ ఇస్తున్నట్టు తెలిపారు. సొసైటీ చైర్మన్ పి.ఆర్.వి.పి.ఎస్.రాజు మాట్లాడుతూ తమ సొసైటీ 5 రాష్ట్రాలలో 42 శాఖలతో మల్టీ స్టేట్ సొసైటీగా ఉన్నట్టు తెలిపారు. సొసైటీ పటిష్టంగా ఉందని, మరింతగా బలోపేతం కావడానికి సభ్యులు సహకారం అందించాని కోరారు. డైరెక్టర్ జె.సత్యనారాయణ మాట్లాడుతూ సొసైటీ ఏర్పడి 26 సంవత్సరాలు పూర్తి చేసుకొని 27 వసంతంలో అడుగుపెట్టినట్టు తెలిపారు. ముందుగా సభకు యానాం బ్రాంచి మేనేజర్ కాశి అశోక్ కుమార్ ఆహ్వానం పలికారు. సభలో పారిశ్రామిక వేత్త ఈలప్రోలు విష్ణువర్ధనరావు, విశ్రాంత పరిపాలనాధికారి నామాడి అప్పారావు, జనమిత్ర ఎడిటర్ పొనుగుమట్ల విష్ణుమూర్తి, న్యాయవాది మాజేటి నటరాజ్ ప్రసంగించారు.

కలకలలాడిన ఆలయాలు

ప్రజాశక్తి - యానాం

శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని రెండో శుక్రవారం సందర్భంగా యానాం లోని వివిధ ఆలయాలకు యాత్రికులు పోటెత్తారు. స్థానిక లక్ష్మీ గణపతి ఆలయం, శివాలయం, లలితాదేవి ఆలయం, గోపాల్ నగర్ శారదాదేవి, రామరాజు గార్డెన్‌లో ఉన్న ధనలక్ష్మి కళ్యాణ లక్ష్మి ఆలయాలు కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లో అమ్మవార్లను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు చేసి భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు.


దినోత్సవంలో పాల్గొన్న క్రీడాకారులు, సాయి స్పోర్ట్స్ సభ్యులు

ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం

ప్రజాశక్తి - యానాం

స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అకాడమీ ఆధ్వర్యంలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యానంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడాదినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 23 నుంచి 25 వరకు వివిధ కార్యక్రమాలను 7 పిక్స్, లెగ్ క్రికెట్, బాస్కెట్బాల్, అథ్లెటిక్స్ పోటీలను, వెటరన్స్‌కు వాకింగ్ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అల్లూరి సీతారామరాజు, భగత్సింగ్, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ గ్రూపులుగా విడదీసి పోటీలను నిర్వహించగా సుభాష్ చంద్రబోస్ గ్రూపు మేజర్ ధ్యానంద్ ట్రోఫీని కైవసం చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ అధికారి నల్లం నాగేశ్వరరావు, సెంటర్ ఇన్‌ఛార్జి జి.లింగేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారి ఇలా.. పిహెచ్‌సికి వెళ్లేదెలా..

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వెళ్ళడానికి మండలంలోని 18 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో చాలా లోతుగా గోతులు తవ్వి వదిలేసారు. గోతుల్లో వాహనదారులు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేట్లపాలెం పిహెచ్‌సికి వెళ్ళే మండల పరిధిలో ప్రజలు ఈ గోతుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడక తప్పడం లేదు. ముఖ్యంగా వైద్యం కోసం వచ్చే రోగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని అక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయితీ, మండల పరిషత్ అధికారుల దృష్టికి తెచ్చినా సమస్య అలాగే ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. పాడైన రహదారిని తక్షణమే నిర్మించి పిహెచ్‌సికి వచ్చే ఇతర గ్రామాల ప్రజలకు, వేట్లపాలెం గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని వేట్లపాలెం గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై మండల ఆర్‌డబ్ల్యూ ఎస్ ఎ.ఈ పద్మరూపను వివరణ కోరగా సమస్య తమ దృష్టికి వచ్చిందని, బడ్జెట్ లేకపోయినా ఎంపీ వంగా గీత ఆదేశాలతో రెండు రోజుల్లో కల్వర్టు నిర్మాణం పనులు పూర్తి చేయనున్నట్లు చెప్పారు.


వేట్లపాలెం పిహెచ్‌సి వద్ద తవ్వి వదిలేసిన గోతులు


గొయ్యి దాటేందుకు వాహనదారుని అవస్థలు

కొండెవరం సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

కొండెవరం పంచాయతీ సర్పంచ్ వేమగిరి చెల్లాయమ్మ అక్రమాలకు పాల్పడ్డారంటూ ఇటీవల అధికారులు ఆమె చెక్ పవర్ రద్దు చేయడాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఆమె చెక్ పవర్‌ను పునరుద్ధరించాలని ఆదేశించింది. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ చెల్లాయమ్మ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. తాను అవినీతికి పాల్పడకపోయినా అధికార పార్టీ కావాలనే తనపై అవినీతి ఆరోపణలు చేసి చెక్ పవర్ రద్దు చేయించారన్నారు. తాను హైకోర్టును ఆశ్రయించడంతో న్యాయం గెలిచిందని ఆమె తెలిపారు. పార్టీలకు అతీతంగా 900 ఓట్ల మెజార్టీతో తనను గెలిపించారని, దళిత సర్పంచ్‌ను కావడంతో కక్ష పూరితంగా తనపై నిందలు మోపుతున్నారన్నారు చేశారు. తాను ఎటువంటి అవినీతికీ పాల్పడలేదని హైకోర్టును ఆశ్రయించినట్టు చెప్పారు. చెక్కు పవర్‌ను వెంటనే పునరుద్ధరించాలని హైకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. గతంలో గ్రామంలో సచివాలయాన్ని హోమ్ మంత్రి ప్రారంభించినప్పటికీ, ఇప్పటివరకు తాళాలు వేసే ఉన్నాయన్నారు. అనంతరం కేక్ కట్ చేసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేమగిరి రాంబాబు, గాది రాజబాబు, ఎంపిటిసి, గ్రామస్తులు పాల్గొన్నారు.


కోర్టు ఆదేశాలను చూపుతున్న సర్పంచ్